## క్లుప్తంగా

### నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నల్లగొండ : పట్టణంలోని పలు కాలనీల్లో విద్యుత్ తీగల కింద ఉన్న చెట్ల కొమ్మలను తొలగిస్తున్నందున శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏడీఈ శంకరయ్య ఒక ప్రకటనలో తెలిపారు. జమ్మలగూడ, హౌజింగ్ బోర్డు, ఇస్లాంపుర, లైన్‌వాడ చౌరస్తా, జామమసీదు, అక్కచెల్మ, రహ్మాన్‌బాగ్, తులసినగర్, పాట్టుగడ్డ, సిమెంట్ రోడ్డు, మునుగోడు రోడ్డు, పరిసర ప్రాంతాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

### పురుషోత్తమాచార్యకు ఘన సన్మానం



పురుషోత్తమాచార్యను సన్మానిస్తున్న అఖిల బ్రాహ్మణ సంక్షేమ సంఘం నాయకులు

రామగిరి(నల్లగొండ): నల్లగొండ పట్టణానికి చెందిన జాతీయ చలనచిత్ర ఉత్తమ క్రిటిక్ అవార్డు గ్రహీత ఎం.పురుషోత్తమాచార్యను అఖిల భారత సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం నల్లగొండలో సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు బొల్ల వేణుగోపాలరావు, పులిజాల యాదగిరిరావు, గంగరాజు శ్రీనివాసరావు, మోహన్‌రావు, ప్రసాద్, ఆనంద్, రంగాచార్యులు, పెన్నా జయప్రద తదితరులు పాల్గొన్నారు.

### తైక్వాండోలో కురంపల్లి బాలిక ప్రతిభ



అన్వి సహస్రను అభినందిస్తున్న సీఐ వెంకట్

కనగల్ : మండల పరిధిలోని కురంపల్లి గ్రామానికి చెందిన బోనగిరి జయసింహ–కవితల కుమార్తె అన్విసహస్ర గురువారం నల్లగొండ పట్టణంలోని ఇండోర్ స్టేడియంలో జరిగిన తైక్వాండో పోటీల్లో బంగారు పతకం సాధించింది. కోచ్ నాగిళ్ల రమేష్ ఆధ్వర్యంలో అన్విసహస్ర రాణిస్తోందని ఆమె తల్లిదండ్రులు చెబుతున్నారు. అన్విసహస్ర చండూరు పట్టణంలోని గీత విద్యాలయంలో 6వ తరగతి చదువుతోంది. ప్రతిభ కనబర్చిన అన్విసహస్రను సీఐ వెంకట్ అభినందించారు.

### బీజేపీలో చేరిన బీఆర్ఎస్ సర్పంచ్

మునుగోడు : మండలంలోని గుండ్లోరిగూడెం గ్రామ బీఆర్ఎస్ సర్పంచ్ పల్లెబోయిన యాదయ్య బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి మునుగోడు నియోజకవర్గ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి చలమల్ల కృష్ణారెడ్డి సమక్షంలో శుక్రవారం బీజేపీలో చేరారు. ఆయనతో పాటు బొల్లం సత్యనారాయణ, పల్లెబోయిన సత్యనారాయణ, జీడిమడ్ల సైదులు బీజేపీలో చేరారు.

### అమిత్ షా బహిరంగ సభకు భారీగా తరలిరావాలి

నల్లగొండ టూటౌన్ : అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా నల్లగొండలోని మేకల అభినవ్ ఔట్‌డోర్ స్టేడియంలో శనివారం నిర్వహించనున్న కేంద్ర మంత్రి అమిత్ షా బహిరంగ సభకు పార్టీ శ్రేణులు, ప్రజలు భారీగా తరలిరావాలని నల్లగొండ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి మాదగాని శ్రీనివాస్‌గౌడ్ కోరారు. శుక్రవారం నల్లగొండలోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నూకల నరసింహారెడ్డి, వీరెల్లి చంద్రశేఖర్, నాయకులు పోతెపాక సాంబయ్య, చింతా ముత్యాల్‌రావు, నిమ్మల రాజశేఖర్‌రెడ్డి, సిద్ధు, అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### రేపటి నుంచి కోటమైసమ్మ బ్రహ్మోత్సవాలు

నిడమనూరు : మండలంలోని కోటమైసమ్మ ఆలయ బ్రహ్మోత్సవాలు ఆదివారం నుంచి నిర్వహిస్తున్నట్లు ఆలయ ట్రస్టీ ఆంజనేయులు, ఈఓ నవీన్‌కుమార్ శుక్రవారం తెలిపారు. 19న సుప్రభాత సేవ, ప్రాతఃకాల పూజ, గణపతి పూజతో, చండీహోమంతో వేద పండితులు బ్రహ్మోత్సవాల ప్రారంభం, 20న బలిహరణ, నైవేద్య సమర్పణ, 21న అమ్మవారికి బోనాలు, దీపోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయని తెలిపారు. మూడు రోజుల పాటు బ్రహ్మోత్సవాలు జరుగుతాయని, భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారి కృపకు పాత్రులు కాగలరని వారు కోరారు.

### కాంగ్రెస్ పార్టీ స్పష్టమైన హామీ ఇవ్వాలి

మిర్యాలగూడ టౌన్ : బీఆర్ఎస్ ప్రభుత్వం గొల్ల కుర్మ యాదవులకు గొర్రెలు పంపిణీ చేస్తామని చెప్పి యాదవులను కేసీఆర్ అప్పుల పాలు చేశారని, కాంగ్రెస్ అధికారంలోకి వస్తే వంద రోజుల్లో గొర్రెలను పూర్తిస్థాయిలో పంపిణీ చేస్తామని స్పష్టమైన హామీ ఇవ్వాలని గొర్రెల పెంపకందారుల సహకార సంఘం జిల్లా కార్యదర్శి ఉరిబండి శ్రీనివాస్ యాదవ్ అన్నారు. శుక్రవారం స్థానికంగా నిర్వహించిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు.

# కేసీఆర్ పథకాలతో పేదలకు భరోసా



నల్లగొండ రూరల్ : అన్నెపర్తిలో మాట్లాడుతున్న కంచర్ల భూపాల్‌రెడ్డి



నల్లగొండ టూటౌన్: పార్టీలోకి ఆహ్వానిస్తున్న కంచర్ల కృష్ణారెడ్డి

- నల్లగొండ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి కంచర్ల భూపాల్‌రెడ్డి

నల్లగొండ రూరల్ : సీఎం కేసీఆర్ అమలుచేస్తున్న సంక్షేమ పథకాలే పేదలకు భరోసాగా నిలిచాయని నల్లగొండ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కంచర్ల భూపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం నల్లగొండ మండలంలోని అన్నెపర్తి, బుద్దారం, అప్పాజీపేట, రాములబండ, రంగారెడ్డినగర్, దోమలపల్లి, నర్సింగ్‌బట్ల, పాతూరు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం రైతు బంధు, రైతు బీమా, 24 గంటల ఉచిత విద్యుత్, ఉచిత చేపపిల్లల పంపిణీ, గొర్రెల పంపిణీ చేశామని తెలిపారు. వృద్ధులకు, దివ్యాంగులకు, చేనేత కార్మికులకు పింఛన్లు అందిస్తున్నామన్నారు. మూడోసారి కేసీఆర్ సీఎం కాగానే వివాహం అయిన ఆడపిల్లకు పింఛన్, కల్యాణలక్ష్మి రూ.2లక్షలు అందజేస్తామని తెలిపారు. వంట గ్యాస్ రూ.400 లకే ఇస్తామన్నారు. అన్ని గ్రామాల్లో సీసీ రోడ్లు వేశామని, రైతు వేదికలు, శ్మశానవాటికలు నిర్మించామన్నారు. సొంత స్థలంలో ఇల్లు కట్టుకునేందుకు గృహలక్ష్మి పథకం అమలు చేస్తున్నామన్నారు. రేషన్ కార్డుపై సన్న బియ్యం ఇవ్వబోతున్నట్లు తెలిపారు. నల్లగొండ అభివృద్ధికోసం రూ.1300 కోట్లు ఖర్చు చేశామన్నారు. కాంగ్రెస్ వస్తే కరెంట్ కష్టాలు తప్పవని, నోటుకు ఓటు వేస్తే మోసపోయి గోస పడతామన్నారు. ఎలాగైనా జిమ్మిక్కులు చేసి గెలవాలని తనపై రోటీమేకర్ గుర్తు పెట్టించారని ఆరోపించారు. కారు గుర్తుపై ఓటు వేసి తనను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. డాక్టర్ చెరుకు సుధాకర్, చకిలం అనిల్‌కుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ నాయకుల మాయమాటలు నమ్మొద్దన్నారు. గతంలో జరిగిన అభివృద్ధి, నేడు జరుగుతున్న అభివృద్ధి ఎలా ఉందో ఆలోచన చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో చీర పంకజ్‌యాదవ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దేప వెంకట్‌రెడ్డి,ఏ ఆలకుంట్ల నాగరత్నం రాజు, భిక్షం యాదవ్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, నాయకులు మేకల అరవింద్ రెడ్డి, నూకల గట్టయ్య యాదవ్, కంభంపాటి వెంకన్న, లింగస్వామి, తుమ్మల రాధ, బకరం వెంకన్న, యాదమ్మ, రవీందర్ రెడ్డి, తవిటి కృష్ణ, సైదులుయాదవ్, ఉపేంద్ర చారి, సైదులు గౌడ్, చామకూరి తిరుమలేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

**బీఆర్ఎస్ పార్టీలో చేరిక**

నల్లగొండ టూటౌన్ : పట్టణంలోని 6వ వార్డు శాంతినగర్‌కు చెందిన బొల్లెద్దు రఘు ఆధ్వర్యంలో 100 మంది కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు శుక్రవారం నల్లగొండలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కంచర్ల కృష్ణారెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. సుంకిరెడ్డి వీరేందర్‌రెడ్డి, బొమ్మరబోయిన ముత్యాలు, బొల్లెద్దు నరేందర్, వెంకన్న, సురేష్‌కుమార్, కర్నాటి లింగారెడ్డి, గోలి నాగరాజు తదితరులు బీఆర్ఎస్‌లో చేరారు.

### బీజేపీలో పలువురి చేరిక

కనగల్ : మండల పరిధిలోని బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు చెందిన అయితగోని లక్ష్మయ్య, తాందారుపల్లి కృష్ణయ్య, అయితగోని మల్లేష్, అయితగోని అంజయ్యలు శుక్రవారం నల్లగొండ నియోజకవర్గ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి మాదగాని శ్రీనివాస్‌గౌడ్ సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ కార్యక్రమంలో దోరెపల్లి మాజీ సర్పంచ్ మాదగాని సాయన్నగౌడ్, ఉప సర్పంచ్ దాసరి వెంకన్న తదితరులున్నారు.

### కోమటిరెడ్డి సతీమణి ప్రచారం

నల్లగొండ : కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ ఆయన సతీమణి సబిత శుక్రవారం నల్లగొండ పట్టణంలోని 10వ వార్డు నీలగిరి కాలనీ, కనకదుర్గ కాలనీల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు అంగోతు ప్రదీప్ నాయక్, బుర్రి చైతన్య శ్రీనివాస్‌రెడ్డి, జూలకంటి ధనలక్ష్మి శ్రీనివాస్, గుమ్మల జానకి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షురాలు నాంపల్లి భాగ్యనరసింహ, అబ్బగోని కవిత తదితరులు పాల్గొన్నారు.

**చిట్యాలలో చిరుమర్తి కుమారుడు..**

చిట్యాల: నకిరేకల్ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి చిరుమర్తి లింగయ్యను గెలిపించాలని కోరుతూ చిరుమర్తి లింగయ్య కుమారుడు మనోజ్‌కుమార్ శుక్రవారం చిట్యాల మున్సిపాలిటీలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయన వెంట పార్టీ కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

### ప్రలోభాలకు లొంగొద్దు



ప్రచారం చేస్తున్న చొల్లేటి ప్రభాకర్

నల్లగొండ టౌన్ : మద్యానికి, ప్రలోభాలకు లొంగకుండా ప్రజలు తమ ఓటును ఆలోచించి వేయాలని నల్లగొండ నియోజకవర్గ స్వతంత్ర అభ్యర్థి, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చొల్లేటి ప్రభాకర్ కోరారు. శుక్రవారం నల్లగొండ పట్టణంలోని ఫోర్‌వీలర్స్ అడ్డా వద్ద ఆయన ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. నిస్వార్థంతో ప్రజలకు సేవ చేయాలనే ఆలోచనతో స్వతంత్ర అభ్యర్థిగా అసెంబ్లీ బరిలో నిలిచిన తన కంప్యూటర్ గుర్తుపై ఓటు వేసి గెలిపిస్తే నియోజకవర్గాలన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానన్నారు.

### కాంగ్రెస్ కార్యాలయం ప్రారంభం

మర్రిగూడ : మండల కేంద్రంలో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ఆ పార్టీ మండల నాయకులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ వెంకటంపేట బాలయ్య, ఉప సర్పంచ్ గొర్రె అలివేలునర్సింహ, పల్లె మల్లేష్, ఈద రాములు, గ్యార యాదయ్య, సిలివేరు చంద్రయ్య, గొట్టిముక్కల దేవేందర్, రమేష్, శేఖర్, ఆంజనేయులు, ఎండీ.అశ్వద్ తదితరులు పాల్గొన్నారు.

### బీఆర్ఎస్ పార్టీతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యం

- నకిరేకల్ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి చిరుమర్తి లింగయ్య

నార్కట్‌పల్లి : బీఆర్ఎస్ పార్టీతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని నకిరేకల్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి చిరుమర్తి లింగయ్య అన్నారు. శుక్రవారం నార్కట్‌పల్లి మండలంలోని తొండల్‌వాయి, జువ్విగూడెం, నెమ్మాని గ్రామాల్లో జెడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డితో కలిసి నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో చిరుమర్తి లింగయ్య మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, ఎంపీపీ సూదిరెడ్డి నరేందర్‌రెడ్డి, చెరుకు సుధాకర్, శేపూరి రవీందర్, సర్పంచ్ సూదిరెడ్డి ప్రేమలత, గంట నర్సిరెడ్డి, ఎంపీటీసీ మేకల రాజిరెడ్డి, బైరెడ్డి కరుణాకర్‌రెడ్డి, చింత ప్రమీల, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

### బాధ్యతల స్వీకరణ

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడ ఐదో అదనపు జిల్లా న్యాయమూర్తి, మండల న్యాయ సేవా అధికారి సంస్థ అధ్యక్షుడిగా జి. వేణు శుక్రవారం బాధ్యతలను స్వీకరించారు. ప్రస్తుతం మిర్యాలగూడ ఐదో అదనపు జిల్లా న్యాయమూర్తిగా పనిచేస్తున్న కె.కవిత నల్లగొండ నాలుగో అదనపు జిల్లా న్యాయమూర్తిగా బదిలీ కావడంతో ఆ స్థానంలో సికింద్రాబాద్‌లోని సిటి సివిల్ కోర్టు, అడిషినల్ మెట్రోపాలిటిన్ న్యాయమూర్తిగా పనిచేస్తున్న జి. వేణు మిర్యాలగూడ ఐదో అదనపు జిల్లా న్యాయమూర్తిగా వచ్చి బాధ్యతలను స్వీకరించారు.

### ఘనంగా నాగుల చవితి



పానగల్ రేణుకా ఎల్లమ్మ ఆలయం వద్ద భక్తులకు హారతి ఇస్తున్న అర్చకుడు



పానగల్ రేణుకా ఎల్లమ్మ ఆలయంలోని పుట్టలో పాలు పోస్తున్న భక్తులు



వీటీ కాలనీలోని పుట్ట వద్ద పూజలు చేస్తున్న భక్తులు



పానగల్ రోడ్డులోని రేణుకా ఎల్లమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

## విద్యార్థులకు అర్థవంతంగా బోధించాలి

చిట్యాల : తరగతి గదిలో విద్యార్థులకు అర్థవంతంగా, అవగాహన చేసుకునేలా ఉపాధ్యాయులు బోధించాలని ఎఫ్ఎల్ఎన్ ప్రోగ్రాం అబ్జర్వర్ శేషు అన్నారు. చిట్యాలలో శుక్రవారం జరిగిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధ్యాయులు ప్రణాళిక సోపానాలను వినియోగిస్తూ విద్యాబోధన చేయడం ద్వారా విద్యార్థులు త్వరగా అర్థం చేసుకుంటారన్నారు. విద్యార్థులను గ్రూపులుగా చేసి వర్క్ ప్రాక్టీస్ చేయించాలని సూచించారు. వినడం, చదవడం, రాయడం వంటి అంశాలపై ఆసక్తి కలిగించేలా పాఠాలు బోధించాలన్నారు. కాంప్లెక్స్ హెచ్ఎం కె.కరుణాకర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎంఈఓ నర్సింహ, ఉపాధ్యాయులు బోయ శ్రీనివాసులు, సీఆర్‌పీలు జాన్, ప్రవళిక పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శేషు

### హామీల అమలులో విఫలం

కట్టంగూర్ : రాష్ట్ర ప్రభుత్వం గత ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని నకిరేకల్ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి నకిరేకంటి మొగులయ్య అన్నారు. శుక్రవారం పామనగుండ్ల, ఎరసానిగూడెం, ముత్యాలమ్మగూడెం గ్రామాల్లో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షురాలు ఐతగోని అనిత, మండల అధ్యక్షుడు పబ్బు వెంకటేశ్వర్లు, పసుల సైదులు, పాదూరి వెంకట్‌రెడ్డి, కోమటి భాస్కర్, పులకరం శంకర్, గున్నల నాగరాజు, కారంపూడి సాయి, వీరేశ్ ఉన్నారు.

### బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలి



అవగాహన కల్పిస్తున్న బ్యాంక్ మేనేజర్ తులసీరావు

మర్రిగూడ : ఏపీజీవీబీ అందించే రుణ సేవలను ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని మర్రిగూడ బ్రాంచ్ మేనేజర్ సీహెచ్.తులసీరావు అన్నారు. బ్యాంకు అందించే పలు సేవలపై శుక్రవారం మండలంలోని రాంరెడ్డిపల్లిలో ఖాతాదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాధారణ గృహ రుణాలు 8.50 శాతం నుంచి ప్రారంభమై ప్రాసెసింగ్ ఫీజు సున్నా ఉంటుందని, మహిళా రుణ గ్రహీతలకు వడ్డీలో 0.05 శాతం రాయితీ కల్పిస్తున్నట్లు తెలిపారు. వికాస్ ధనవృద్ధి డిపాజిట్‌లో భాగంగా సీనియర్ సిటిజన్లకు 8శాతం, సాధారణ పౌరులకు 7.50 శాతం వడ్డీ చెల్లిస్తున్నామని, బంగారంపై రుణాలు అందిస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట ఫీల్డ్ ఆఫీసర్ ఎస్.శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

### కమ్యూనిస్టులతోనే ప్రజాస్వామ్యం బలపడుతుంది

మర్రిగూడ : కమ్యూనిస్టులతోనే ప్రజాస్వామ్యం బలపడుతుందని మునుగోడు నియోజకవర్గ సీపీఎం ఎమ్మెల్యే అభ్యర్థి దోనూరి నర్సిరెడ్డి అన్నారు. శుక్రవారం మర్రిగూడ మండలంలోని మేటిచందాపురంతోపాటు పలు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో కమ్యూనిస్టులను గెలిపిస్తే ప్రజా సమస్యల పరిష్కారానికి అసెంబ్లీలో గొంతెత్తి మాట్లాడతామన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బండా శ్రీశైలం, ప్రజానాట్య మండలి జిల్లా అధ్యక్షుడు నాంపల్లి చంద్రమౌళి, ఆయా మండలాల కార్యదర్శులు కర్నాటి మల్లేశం, ఏర్పుల యాదయ్య, బొట్ట శివకుమార్, ధనుంజయ, ముత్తిలింగం, లక్ష్మయ్య, యాదయ్య, సత్తయ్య, ముత్యాలు, రాములు పాల్గొన్నారు.

### రాష్ట్ర స్థాయి పోటీలకు అక్షర విద్యార్థి




ధృవికను అభినందిస్తున్న పాఠశాల యాజమాన్యం

నల్లగొండ టూటౌన్ : నల్లగొండ పట్టణంలోని అక్షర స్కూల్ విద్యార్థిని దుప్పలపల్లి ధృవిక రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైంది. అండర్–14 విభాగంలో ఇటీవల సూర్యాపేటలో జరిగిన పోటీల్లో జిల్లాస్థాయి పోటీల్లో గెలుపొంది రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. శుక్రవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థిని ధృవికను పాఠశాల కరస్పాండెంట్ పోలోజు నాగేందర్, చైర్మన్ కక్కిరేణి లక్ష్మీనారాయణ, ప్రిన్సిపాల్ అనూష, పీఈటీ గిరిజ, ఉపాధ్యాయులు అభినందించారు.

### బీఎస్పీ అధికారంలోకి వస్తే బహుజనులకు న్యాయం

శాలిగౌరారం : రాష్ట్రంలో బీఎస్పీ అధికారంలోకి వస్తేనే బహుజనులకు న్యాయం జరుగుతుందని తుంగతుర్తి నియోజకవర్గ బీఎస్పీ అభ్యర్థి బొడ్డు కిరణ్ అన్నారు. శాలిగౌరారం మండలంలోని ఆకారం గ్రామంలో శుక్రవారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడారు.

## భాష మార్చుకోకుంటే సహించేది లేదు

- నకిరేకల్ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి చిరుమర్తి లింగయ్య

నార్కట్‌పల్లి : మాజీ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి తన భాష మార్చుకోకుంటే సహించేది లేదని నకిరేకల్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చిరుమర్తి లింగయ్య అన్నారు. శుక్రవారం నార్కట్‌పల్లి మండల కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తనను గెలవకుండా చేయడం కాదు, కోమటిరెడ్డి సోదరులు ఓడిపోవడం ఖాయమన్నారు. జీవితంలో గెలుపు ఓటములు అన్నీ చూస్తామని, బెదిరింపులకు బయపడేది లేదన్నారు. ఈ సమావేశంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, ఎంపీపీ సూదిరెడ్డి నరేందర్‌రెడ్డి, చిట్యాల మార్కెట్ కమిటీ చైర్మన్ జడల ఆదిమల్లయ్య, శ్రవణ్‌కుమార్, వాజిద్‌అలీ, చింత ప్రమీల, సుధాకర్, రవి, రాజు తదితరులు పాల్గొన్నారు.

**బెదిరించే వ్యాఖ్యలు సరికాదు : సుధాకర్**

నకిరేకల్ : మునుగోడు మాజీ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి నకిరేకల్ నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారంలో బీఆర్ఎస్ నేతలను బెదిరించే విధంగా వ్యాఖ్యలు చేయడం సరైంది కాదని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు డాక్టర్ చెరుకు సుధాకర్ అన్నారు. నకిరేకల్‌లోని బీఆర్ఎస్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారంలోకి వచ్చాక బీఆర్ఎస్ నేతలను తొక్కుకుంటా పోతానని కేతేపల్లిలో రాజగోపాల్‌రెడ్డి బీఆర్ఎస్ నేతలను ఉద్దేశించి మాట్లాడడం సరైంది కాదని, ఆయన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని క్షమాపణ చెప్పాలని కోరారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ మండల, పట్టణ అధ్యక్షులు ప్రగడపు నవీన్‌రావు, యల్లపురెడ్డి సైదిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ మహిందర్‌రెడ్డి, పెండెం సదానందం, కొండ శ్రీను, కేశవరాజు, పల్లె విజయ్, రాచకొండ సునీల్ , దైద పరమేషం, చౌగోని శంకర్, వెంకన్నగౌడ్, గర్శకోటి సైదులు, వలీ పాల్గొన్నారు.

## ఎన్జీ కళాశాల అధ్యాపకుడికి విద్యా సేవారత్న పురస్కారం



పురస్కారం అందుకుంటున్న లింగస్వామి

రామగిరి(నల్లగొండ): నల్లగొండ పట్టణంలోని ఎన్జీ కళాశాలలో తెలుగు అధ్యాపకుడిగా పనిచేస్తున్న మామిడి లింగస్వామి జగతి ఆర్ట్స్ సంస్థ నుంచి విద్యా సేవా రత్న పురస్కారం పొందారు. చిల్డ్రన్స్ కల్చరల్ ఫీస్ట్ 2023ను పురస్కరించుకుని వివిధ రంగాల్లో విశిష్ట సేవలందించినందుకు పురస్కారం అందజేశారు. హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో దైవజ్ఞశర్మ, సినీ గేయ రచయిత డాక్టర్ సుద్దాల అశోక్‌తేజ చేతుల మీదుగా లింగస్వామి పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా లింగస్వామిని ఎన్జీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఉపేందర్, అధ్యాపకులు డాక్టర్ తండు కృష్ణకౌండిన్య, డాక్టర్ ఎన్.దీపిక, ఎన్.లవీందర్‌రెడ్డి, డాక్టర్ వి.శ్రీధర్, టి.సైదులు, ఎస్.ప్రభాకర్, బి.రమ్య, లైబ్రేరియన్ డాక్టర్ ఏ.దుర్గా ప్రసాద్ అభినందించారు.

### కార్మికుల పక్షాన పోరాడేది సీపీఎం ఒక్కటే

రామగిరి(నల్లగొండ): వ్యవసాయ కార్మికులు, కూలీల హక్కుల కోసం పోరాడేది సీపీఎం ఒక్కటేనని నల్లగొండ నియోజకవర్గ సీపీఎం అభ్యర్థి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం తిప్పర్తి మండలం మామిడాల, యాపలగూడెం, గోదోరిగూడెం, ఎల్ల మ్మగూడెం, ఆరెగూడెం గ్రామాల్లో సుధాకర్‌రెడ్డి ఎన్నిక ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో తనకు ఓటు వేసి అధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నన్నూరి వెంకటరమణారెడ్డి, మన్నెం భిక్షం, పుల్లెంల శ్రీకర్, దేవిరెడ్డి అశోక్‌రెడ్డి, భీమగాని గణేశ్ పాల్గొన్నారు.

**సుధాకర్‌రెడ్డిని గెలిపించాలని ప్రచారం**

నల్లగొండ టౌన్ : అసెంబ్లీ ఎన్నికల్లో సీపీఎం అభ్యర్థి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి సుత్తి కొడవలి నక్షత్రం గుర్తుపై ఓటు వేసి అధిక మెజార్టీతో గెలిపించాలని కోరుతూ సీపీఎం నాయకులు శుక్రవారం నల్లగొండ పట్టణంలోని పలు కాలనీల్లో ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. జిల్లా కమిటీ సభ్యుడు దండెంపల్లి సత్తయ్య, కుంభం కృష్ణారెడ్డి, సరోజ, పిన్నపురెడ్డి మధుసూదన్‌రెడ్డి, అరుణ, సైదాచారి, చంద్రయ్య, మారయ్య, యాదయ్య, చంద్రబాబు, రామకృష్ణారెడ్డి, అంజయ్య, కళమ్మ, సుజాత, శివమ్మ, గడ్డం రాములు, శ్రీరంగం, శ్రీనివాసచారి, రాధాకృష్ణ, ఆంజనేయులు పాల్గొన్నారు.

### కాంగ్రెస్ పార్టీలో చేరిక

మర్రిగూడ : మండలంలోని రాంరెడ్డిపల్లి గ్రామానికి చెందిన పలు పార్టీల కార్యకర్తలు ఎంపీటీసీ వెన్నమనేని శోభారవీందర్‌రావు ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సమక్షంలో మునుగోడులో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో బండి హన్మంతు, నక్క శ్రీనివాస్, వెన్నమనేని దామోదర్‌రావు, నక్క బుగ్గరాములు తదితరులు పాల్గొన్నారు.

### కాంగ్రెస్‌ను మోసం చేసిన చిరుమర్తిని ఓడించాలి

- కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

నార్కట్‌పల్లి : కాంగ్రెస్ పార్టీ తరపున ఎమ్మెల్యేగా గెలిచి, పార్టీని, కార్యకర్తలను మోసం చేసి బీఆర్ఎస్‌లో చేరిన చిరుమర్తి లింగయ్యను నకిరేకల్ నియోజకవర్గ ప్రజలు ఓటు ద్వారా బుద్ధి చెప్పి ఓడించాలని మునుగోడు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం నార్కట్‌పల్లి పట్టణంలో నకిరేకల్ ఎమ్మెల్యే అభ్యర్థి వేముల వీరేశంతో కలిసి నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బత్తుల ఉషయ్య, మాజీ ఎంపీపీ పబ్బతిరెడ్డి వెంకట్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ అల్లుబెల్లి రవీందర్‌రెడ్డి, దూదిమెట్ల సత్తయ్య, ఎంపీటీసీ పాశం శ్రీనివాస్‌రెడ్డి, పుల్లెంల అచ్చాలు తదితరులు పాల్గొన్నారు.

**పన్నెండు స్థానాల్లో కాంగ్రెస్‌దే గెలుపు**

కేతేపల్లి : ఉమ్మడి జిల్లాలోని పన్నెండు స్థానాలను కాంగ్రెస్ పార్టీ గెలుచుకుంటుందని కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. నకిరేకల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి వేముల వీరేశంకు మద్దతుగా కేతేపల్లిలో రోడ్‌షోలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ అభ్యర్థి వేముల వీరేశం, పార్టీ మండల అధ్యక్షుడు కె.శ్రీనివాస్‌యాదవ్, మహిళా అధ్యక్షురాలు ఎస్.మంగమ్మ, పూజర్ల శంభయ్య, దైద రవీందర్, పీఏసీఎస్ చైర్మన్ బోళ్ల వెంకట్‌రెడ్డి, కేతేపల్లి, నకిరేకల్ ఎంపీపీలు పెరుమాళ్ల శేఖర్, శ్రీదేవిగంగాధర్‌రావు, మాజీ జెడ్పీటీసీ కోట మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

### పది లీటర్ల సారా పట్టివేత

కొండమల్లేపల్లి : అంగోతుతండాకు చెందిన అంగోతు హంజ శుక్రవారం 10 లీటర్ల నాటు సారాను కొండమల్లేపల్లికి తరలిస్తుండగా పోలీసులు స్థానిక ఆర్టీసీ బస్టాండు వద్ద పట్టుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వీరబాబు తెలిపారు.